RNI No :TELTEL2022/83073


# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 246 | ఆగస్టు 30, 2025 | వెల : రూ.3-00



ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

3లో..







## బోర్డుపై ఓ పేరు..

# మరో పేరుతో అనుమతులు!

- సదరు విద్యాసంస్థ తీరే సెప'రేటా'?
- ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారుల ఉదాసీనత
- విద్యాశాఖలో వింత.. అసలు ఆ సంస్థ ఎలా నడుస్తోంది?

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

సాధారణంగా ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం అప్లయ్ చేసుకున్నా.. లేదా జాబ్ వచ్చినా పేరులో ఒక అక్షరం(లెటర్) తప్పుగా ఉన్నా.. అధికారులు సవాలక్ష కొర్రీలు పెడుతుండటం మనం గమనించొచ్చు. సదరు తప్పుల వల్ల బాధితులు పడే ఆ అవస్థలు అంతా ఇంతా కాదు. ఇంతకీ ఈ ఇబ్బందుల గురించిన ప్రస్తావన ఇప్పుడు ఎందుకంటే.. సర్టిఫికెట్లలో చిన్న అక్షరం తప్పుంటేనే అరిగోసలు పడే వ్యవస్థలో.. అసలు విద్యా సంస్థ పేరు బోర్డుపై ఒకటి ఉండి.. దానికి అనుమతులు లేకపోగా, పర్మిషన్ ఉన్న సంస్థ పేరు మరొకటి అయితే ఎలా ఉంటుందో ఊహించుకోండి.. సదరు ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్‌లో చదువుకునే స్టూడెంట్స్.. తాము రాసుకునే స్కూల్ పేరు ఒకటి,కాగా సదరు సంస్థ వారు మరో నేమ్ బోర్డుపై రాసి.. విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఇప్పుడు విద్యార్థులు తాము ఏ స్కూల్‌లో చదువుకున్నాం? అనే ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలి? అనేది మిలియన్ డాలర్ ప్రశ్నగానే ఉండనుంది..!

**- ఉన్నతాధికారులు స్పందించాలి**

అసలు అక్షరం తప్పు ఉంటేనే నానా ఇబ్బందులు పెట్టే అధికారులు.. టోటల్ నేమ్ చేంజ్ చేసి మరీ.. విద్యా సంస్థ నిర్వాహకులు పాఠశాల నడుపుతుంటే నిమ్మకు నీరెత్తినట్టు సంబంధిత శాఖ అధికారులు వ్యవహరిస్తుండటం వింతే. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నగర శివారులోని ఓ పాఠశాలలో ఈ తంతు బహిరంగంగా ..బాహాటంగానే సాగు..తోంది. సదరు స్కూల్‌లో రూల్స్ ఉల్లంఘనలకు సంబంధించిన పూర్తి ఆధారాలు 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ఫోకస్ టీమ్ క్షేత్రస్థాయి పరిశీలనలో సంపాదించింది. నిత్యం ఆ పాఠశాలకు ఆనుకుని ఉన్న ప్రధాన రహదారి నుంచే సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వెళ్తుంటారు. కానీ, తమ విధుల నిర్వహణను మాత్రం పక్కనపెట్టేస్తున్నారు. ఆఫీసర్ల ఉదాసీనత వెనకున్న ఆంతర్యమేంటో మరి.. చూడాలి.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటారో .. లేదో..

## ప్రజా సమస్యలపై

# పట్టింపు లేదా..?

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు.!

**వేదన్యూస్, వీర్నపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారి వీధి దీపాలు కొన్ని నెలలుగా వెలగడం లేదు. ఈ సమస్యను ఇదివరకు చాలాసార్లు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకుపోయిన కూడా ప్రజా సమస్యలను పేడచెవిన పెడుతూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దృశ్యం కళ్లకు కట్టినట్టు స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాకుండా ఇటీవల వేద న్యూస్ పత్రికలో కూడా ఈ సమస్యపై "భయం.. భయం.!" అనే శీర్షిక కూడా వెలువడినది. అసలే వర్షాకాలం పాములు, తేళ్ల వంటి విషపురుగులు తిరిగే సమయం. ఈ పరిస్థితులలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించే తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.చీకటి పడిందంటే బయట రోడ్లపై అడుగు పెట్టాలంటే ప్రాణాలు అరచేతులలో పెట్టుకోని తిరగాల్సిన పరిస్థితి. ఎటు వైపు నుండి ఏ విష పురుగు వచ్చి కాటేస్తుందో అని భయం భయంగా గడపాల్సిన పరిస్థితి. ఈ సమస్యపై స్థానిక పంచాయతీ సెక్రటరీ,స్పెషల్ ఆఫీసర్ లు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే దీనికి కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజా సమస్యలపై మీకు పట్టింపు లేదా?. రాత్రి సమయాలలో ప్రజలకు ఏదైనా విషపురుగు కుట్టి జరగరానిది జరుగుతే దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు?. సామాన్య ప్రజల ప్రాణాలు అంటే మీకంత చులకనా? అని కూడా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై వీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు మండల పంచాయతీ అధికారికి కనబడడం లేదా?. వీరిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని? కూడా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కావున ఇప్పటికైన పంచాయతీరాజ్ ఉన్నత అధికారులు స్పందించి ఈ సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుని, వీధి దీపాలు పనిచేసేవిదంగా చేసి, సమస్యను పరిష్కరించి ప్రజలను విషపురుగుల బారి నుండి రక్షించాల్సిందిగా వారు కోరుతున్నారు.

# దొరికితేనే దొంగ!?

- దొరకని రెవెన్యూ శాఖ తిమింగలాలెన్నో!
- హాట్ టాపిక్‌గా ఏకకాలంలో 7 చోట్ల సోదాలు
- ఖిలా వరంగల్ తహశీల్దార్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
- ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ శాఖలో కలకలం

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

'దొరికితే దొంగ.. లేదంటే దొర' అనే సంగతి అందరికీ తెలిసిందే. కాగా, వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ తహశీల్దార్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు, ఏకకాలంలో ఏడు ప్రదేశాల్లో సోదాలు.. ఉమ్మడి వరంగల్ జిల్లా రెవెన్యూ శాఖలో కలకలం రేపుతోంది. ఒకే సారి 7 చోట్ల దాడులు చేశారంటే.. దీనికి సంబంధించిన బ్యాగ్రౌండ్ వర్క్ చాలా రోజుల నుంచి జరిగే ఉంటుందనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఇంటెలిజెన్స్‌తో పాటు విజిలెన్స్ ఇతర శాఖల సమన్వయం ఉండే ఉంటుందా? అనే ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయి. అయితే, రెవెన్యూ శాఖలో చట్టానికి చిక్కని అవినీతి తిమింగలాలలు మరెన్నో ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. వారి చిట్టా ఏసీబీకి అంది ఉండే ఉంటుందని, ఇందుకు బ్యాగ్రౌండ్‌లో పలు ప్రభుత్వ శాఖలు పకడ్బందీగా సమన్వయంతో వర్కవుట్ చేస్తేనే.. ఈ తరహా దాడులు జరిగి ఉండి ఉంటాయనే అనుమానాలు సైతం వ్యక్తమవు తున్నాయి. ఏది ఏమైనా అవినీతి చేసి చట్టానికి చిక్కబోమనే ఆలోచన ఎవరికీ రాకుండా ఉండాలంటే.. ఈ తరహా దాడులు మరిన్ని జరగాలని, అవినీతి అధికారుల అంతు చూడాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## భారీగా గంజాయి

# స్వాధీనం




**వేదా న్యూస్, కాజీపేట :**

కాజీపేట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం జీఆర్పీ పోలీసులు భారీగా గంజాయి 32 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తుండగా ముఠా ను పట్టుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ 16 లక్షలు ఉంటుందని, ముగ్గురు నిందితుల అరెస్ట్ చేశామన్నారు. అరెస్టయిన వారిలో ఇద్దరు పురుషులు, ఒక మహిళ అందరూ ఒరిస్సా వాసులుగా గుర్తించామన్నారు. లగేజీ బ్యాగుల్లో పొట్లాలుగా మార్చి తరలిస్తున్నట్లు కాజీపేట జీఆర్పీ సీఐ వడ్డే నరేష్ కుమార్ వెల్లడించారు. ఈ ముఠాకు చెందిన మరో ఇద్దరు కీలక నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగిస్తున్నామన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించమన్నారు.

## అధిక లాభాలంటూ

# ఆశచూపించి దోపిడీలు



**వేద న్యూస్ డెస్క్:**

హైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన ఓ 70 ఏళ్ల విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగికి వాట్సప్‌లో ఓ సందేశం వచ్చింది. మీ ఉద్యోగ విరమణ బెనిఫిట్స్‌ను రెట్టింపు చేసుకునే సదావకాశం అంటూ సైబర్ నేరగాళ్లు వల విసిరారు. ట్రేడింగ్, క్రిప్టోలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఆశించవచ్చని ఆశపెట్టారు. వెంటనే అతన్ని ఓ టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేయడంతో అందులో ఉన్న వారంతా తమకు

మిగతా 4వ పేజీలో..

# రూ.5 కోట్ల పై చిలుకు ఆస్తులు..!

- ఖిలా వరంగల్ తహశీల్దార్ ఇళ్లపై ఏసీబీ దాడులు
- ఏకకాలంలో 7 ప్రదేశాల్లో సోదాలు.. అధికారి అరెస్టు
- బండి నాగేశ్వరరావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం తహశీల్దార్ బండి నాగేశ్వరరావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. శుక్రవారం ఆయన ఇళ్లపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. హన్మకొండలోని చైతన్యపురి, ఆయన స్వస్థలం ఖమ్మం జిల్లాకేంద్రంతో పాటు పలు చోట్ల ఏకకాలంలో దాడులు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి దాడులు మొదలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ కాలంగా తహశీల్దార్‌గా పని చేస్తున్న బండి నాగేశ్వరరావుపై ఏసీబీ దాడులు రెవెన్యూ శాఖలో కలకలం రేపుతోంది. ఆయన తన సర్వీసులో అవినీతి కార్యకలాపాలు చేసి..అనుమానాస్పద మార్గాలలో చట్టబద్ధంగా ఉండాల్సిన వాటిని మించి ఆస్తులను సంపాదించినట్టు తెలుస్తోంది.ఏసీబీ పీఆర్వో అధికారిక వివరాల ప్రకారం.. అధికారులు ఏకకాలంలో

మిగతా 3వ పేజీలో..

## ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- గాఢ నిద్రలోనే భర్త చనిపోయాడంటూ 100కు డయల్
- పోలీసుల ఎంట్రీతో సీన్ రివర్స్!

మిగతా 3వ పేజీలో..

# పెద్ద బాలశిక్ష అందజేత




**వేద న్యూస్, మడికొండ :**

తెలుగు భాష దినోత్సవం సందర్భంగా మడికొండ సోషల్ వెల్ఫేర్ స్కూల్ అండ్ కాలేజ్ బాయ్స్ నందు మడికొండ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జయరాజు పెద్దబాలశిక్ష పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ఇంగ్లీష్ మోజులో పడి, తెలుగు భాష కనుమరుగు అవుతున్న సందర్భంగా తెలుగు భాషకు పూర్వవైభవం తేవాలని నా వంతు సహాయంగా ప్రభుత్వ పాఠశాలల యందు పెద్దబాలశిక్ష పుస్తకాలు అందించడం జరిగిందన్నారు. నా యొక్క చిన్ననాటి గురువు అయిన నరసింహారెడ్డి సార్ పెద్దబాలశిక్ష పుస్తకం చదివితే డిగ్రీ చదివిన దానికి సమానం అని చెప్పినారన్నారు. దానిని స్ఫూర్తిగా తీసుకొని బాలశిక్ష పుస్తకాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి. కుమార్ స్వామి, తెలుగు పండిట్ ఏ జ్యోతి మేడం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గాయపడిన బాధితుడికి ఆర్థిక సాయం


## - అందించిన సామాజిక వేత్త తూడి లచ్చన్న



**వేద న్యూస్,బోయినిపల్లి:**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కొలేపాక శంకరయ్య (తండ్రి లచ్చయ్య) కు కాలు తీవ్రంగా గాయమై నెల రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తూడి లచ్చన్న తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టి.ఎల్. యువసేన సభ్యులు పిట్టల మనోహర్, బైరి శ్రీధర్, రాసూరి రవీందర్, కొలేపాక వేణు, పడాల తిరుపతి పాల్గొన్నారు.

# కమలాపూర్ మోడల్ స్కూల్ లో స్పాట్ అడ్మిషన్లు




వేద న్యూస్, కమలాపూర్ : హనుమకొండ జిల్లా కమలాపూర్ తెలంగాణ మోడ ల్ స్కూల్ లో 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు భర్తీ కాని సీట్లను భర్తీ చేయడం కొరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. జి అనిత తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తమ స్కూల్ బాటలు వేస్తుందని, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులంతా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో విద్యా బోధన చేస్తున్నారని ఇటువంటి చక్కని సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగపరుచుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటుగా పాఠశాలలో సంప్రదించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

# స్నేహితుని కుటుంబానికి ఆర్థిక చేయూత

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలోని 1999-2000 పదవ తరగతి బ్యాచ్ కి చెందిన తమ తోటి స్నేహితుడు ఓనపాకల రాజు తల్లి ఓనపాకల లక్ష్మి అనారోగ్య కారణాల వలన మృతి చెందగా తమ తోటి స్నేహితులు రూ ఇరవై వేల రూపాయలను ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కందగట్ల సంతోష్, మార్త సుమన్, బాసని రవి, పోలబోయిన రాజేందర్, మాదారపు సూర్యప్రకాష్ , అంకుశావళి ,మామిడి మిథున్, కందగట్ల మహేష్, ఏమిశెట్టి సురేందర్, పరకాల దేవేందర్, మల బాసని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 108 సిబ్బందికి శిక్షణ తరగతులు

**వేద న్యూస్,వరంగల్:**



ఎస్ డి ఎల్ సి కేయు అకాడమిక్ కాన్ఫరెన్స్ హాల్లో జీవీకే ఈఎంఆర్ఐ 108 ఉద్యోగులకు వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమం మాన్ని హన్మకొండ జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎక్కడ ఆపద సంభవించిన గుర్తొచ్చేది 108 అంబులెన్స్ ఈ అంబులెన్స్ లో పనిచేస్తున్న సిబ్బంది మానవసేవే మాధవ సేవగా భావించి ఎంతోమంది విలువైన ప్రాణాలను కాపాడారు అని అభినందించారు.

ఈ సందర్భంగా ఎమర్జెన్సీలో శత గాత్రులను ఇలా కాపాడాలో మరియు గోల్డ్ ఇన్ అవర్ కాన్సెప్ట్ ద్వారా ప్రజలకు మెరుగైన అత్యవసర చికిత్సను అందించాలని సూచించారు. 108 ఉద్యోగులు ప్రతిరోజు ఎండనక వాననక రాత్రి అనక ప్రజలకు అత్యవసర సేవలు అందిస్తున్నందుకు ప్రశంసించారు.ఇంకా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే ఎప్పటికప్పుడు శిక్షణ అవసరమని చెప్పారు. మరియు ఎక్కడైనా విపత్తు సంభవించిందంటే అక్కడ 108 ఉద్యోగులు ట్రై ఏజ్ అనే మెడికల్ పదాన్ని ఉపయోగించి కీటగిరి వారిగా విభజించి ఎవరైతే ప్రాణాపాయ స్థితిలో ఉన్నారో వారికి కొన్ని కోడ్లను ఇచ్చి మరి ప్రాణాలు కాపాడాలని చెప్పారు.ఉత్తమ ఎమర్జెన్సీ టెక్నీషియన్లకు స్టార్ అవార్డును అందించారు.

నేషనల్ ఎమర్జెన్సీ లెర్నింగ్ సెంటర్ నుండి వచ్చిన ట్రైనర్ గజేందర్ ని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్, హనుమకొండ జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్,వరంగల్ జిల్లా మేనేజర్ భరత్ కుమార్, ములుగు జిల్లా మేనేజర్ రాజ్ కుమార్,ఉమ్మడి వరంగల్ జిల్లా 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన పాలన కోసమే సమాచార హక్కు చట్టం




వేద న్యూస్,వరంగల్ ప్రతినిధి:
ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబు దారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం 2005పై రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో పిఐఓ, ఆపిలెట్ అధికారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్, డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్ లు పూల మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

అనంతరం రాష్ట్ర సమాచార కమిషనర్లు పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో వారు మొక్కలు నాటారు.అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఇందులోని అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పారదర్శకమైన పాలన కోసం చట్టం ఉపయోగపడాలని, ప్రజలు చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా సదుద్దేశంతో వినియోగించుకోవాలన్నారు. అధికారులు చట్టం పట్ల భయం వీడనాడి నిర్భయంగా యాక్ట్ ప్రకారం అడిగిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందజేయాలని తెలిపారు. ఆర్టిఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని అన్నారు.

అన్ని శాఖల అధికారులు 4-1బి, సిటిజన్ చార్టర్ ను పక్కాగా అమలు చేస్తే సమస్యలు తగ్గుతాయి అన్నారు.పారదర్శకత జవాబుదారీతనంతో నిబంధనలకు లోబడి ఖచ్చితమైన సమాచారం అందించి ప్రజలకు , ప్రభుత్వానికి పౌర సమాచార అధికారులు వారధిగా నిలవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డిఓలు, వివిధ శాఖల పిఐఓలు, అప్పీలెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీ

## - కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలి

**వేద న్యూస్, కాజీపేట :**




తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హనుమకొండ జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తున్నదని, రాష్ట్రంలో బిఆర్ఎస్, కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్న కూడా హనుమకొండ జిల్లా అభివృద్ధి కాలేదని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 62, 63వ డివిజన్ల కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ సయ్యద్ రజాలి అన్నారు. శుక్రవారం కాజీపేట మీడియా పాయింట్లు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు మాట్లాడుతూ జిడబ్ల్యూఎంసి నుండి వందల కోట్లతో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి చొరవతో పెండింగ్ లో ఉన్న పనులకు నిన్ను తెచ్చిన ఘనత ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి అని అన్నారు. కాజీపేట ఫాతిమా నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎన్నో సంవత్సరాలుగా ఉన్న పెండింగ్ పనులు 14 కోట్ల తో జరుగుతున్నవని, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకీ కావాల్సిన పెండింగ్ లో ఉన్నటువంటి నిధులు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహకారంతో వరంగల్ జిల్లా మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు కోరగా, మామునూరులో ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ 200 కోట్ల తో అలాగే ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ 200కోట్ల తో, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు, హనుమకొండ జిల్లాలో ఉన్నటువంటి కాళోజీ కలక్షేత్రం 40 కోట్లతో పూర్తి చేపించి, నయీంనగర్ లో ఉన్న నాలా పనులను పూర్తి చేపించడం వలన చుట్టుపక్కల లో ఉన్న లోకట్టు ప్రాంతాకు నీరు వెళ్లకుండా ప్రశాంతంగా ప్రజలు నిద్రపోతున్నారని అన్నారు. ప్రతి డివిజన్లో ప్రతిపక్షంలో ఉన్న వారికి సైతం కోట్లలో నిధులు సాంక్షన్ చేసిన ఘనత పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అని, అటువంటి వ్యక్తిపై కొందరు బిజెపి నాయకులు మాట జారేముందు, నాయిని చేసిన అభివృద్ధి పనులు గుర్తుపెట్టుకుని మాట్లాడాన్నారు.

ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 63 డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలి, అంకుష్, సుంచు అశోక్, ఆరూరి సాంబయ్య, సీరిల్ లారెన్స్, దొంగల కుమార్, అగ్గర్, పాలడుగుల ఆంజనేయులు, మధు, ఇప్ప శ్రీకాంత్, మంతుర్తి బొంద్యాలు, భరత్,విసుంచు సుధాకర్, సిల్వర్ మల్లికార్జున్, ఇమ్మడి రవికుమార్, బొడ్డు రామ్, రవి, సంతోష్, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రూ.5 కోట్ల పై చిలుకు ఆస్తులు..!

ఖిలా వరంగల్ తహశీల్దార్‌కు సం బంధించిన 7 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. ఆయన వద్ద రూ.1,15,00,000 విలువైన ఇంటి ఆస్తులు, 17 ఎకరాల 10 గుంటల విలువైన వ్యవసాయ భూమి పత్రాలు వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.1,42,98,500 ఉంటుంది, 70 తులాల బరువున్న బంగారు ఆభరణాలు విలువ సుమారు రూ.23,84,700, 1,791 గ్రాముల బరువున్న వెండి వస్తువులు విలువ సుమారు రూ.92,000, వాహనాలు (నాలుగు చక్రాల వాహనాలు-2, ద్విచక్ర వాహనం-1) విలువ సుమారు రూ. 34,78,000, చేతి గడియారాలు-23 విలువ సుమారు రూ.3,28,195, రూ.16,43,803 విలువ గల గృహోపకరణాలు ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ. 5,02,25,198 ఉంటుందని అంచనా వేస్తున్నారు. సదరు తహశీల్దార్‌ను అరెస్టు చేసి, వరంగల్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరుచనున్నట్టు ఆఫీసర్లు వెల్లడించారు. ఖిలా వరంగల్ తహశీల్దార్‌పై నమోదయిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసు దర్యాప్తులో ఉందని పేర్కొన్నారు.

# కొదురుపాక గ్రామానికి బతుకమ్మ తెప్ప మంజూరు

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక ఆర్అండ్ఆర్ కాలనీలో బతుకమ్మ తెప్పను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,ప్రతిపాదనల మేరకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2017 నుంచి ఆర్అండ్ఆర్ కాలనీలో బతుకమ్మ తెప్ప లేకపోవడం వలన గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా కలెక్టర్ తో మాట్లాడి బతుకమ్మ తెప్పను మంజూరు చేయించారు. రాబోతున్న బతుకమ్మ పండుగ లోపు బతుకమ్మ తెప్ప నిర్మాణాన్ని అందరి సహకారంతో పూర్తి చేసుకుందాం అన్నారు. మంజూరు చేయించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# టీఎస్ జేయూ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గా సుధాకర్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ ( ఎన్ యూజేఐ ) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరిగా సినియర్ జర్నలిస్ట్ తడుక సుధాకర్ ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారగాని పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ లో ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించిన అధ్యక్షులు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి, సహకరించిన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు సంతోష్, ప్రధాన కార్యదర్శి రవీందర్ ల కు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్ట్ ల సమస్యల పై రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

# పత్తి, వరి పంటల పరిశీలన



**వేద న్యూస్, వేములవాడ రూరల్ :**

వేములవాడ రూరల్ మండలం కాషాయిపల్లి, హన్మక్కపల్లి గ్రామాల్లో పత్తి మరియు వరి పొలాలను మండల వ్యవసాయ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా పత్తి పొలాల్లో నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించాలని రైతులకు సూచనలు చేశారు. పత్తి పంటలో వేరు కుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 600 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని, అలాగే పంట పెరుగుదలకు మల్టీ కె (13-0-45) 1 కిలో ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు.వరి పంటలో అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోలు 120 గ్రాములు ఎకరానికి, బాక్టీరియా తెగులు నివారణకు స్ట్రెప్టోమైసిన్ 20 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలని తెలిపారు.అలాగే రైతులు పొలాలలో పనిచేసేటప్పుడు విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, వర్షపు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పురుగు మందుల పిచికారీ చేయకూడదని అధికారులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

# నాకు బాస్‌లు ఎవరూ లేరు

**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణ శాసనసభ సమావేశాలు రేపు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను అసెంబ్లీకి స్వతంత్ర సభ్యుడిగానే హాజరవుతానని, ఇకపై తనను ఎవరూ కట్టడి చేయలేరని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని రాజాసింగ్ తీవ్రంగా విమర్శించారు. పార్టీలోని కొందరు నేతల వైఖరి వల్లే ఈ దుస్థితి దాపురించిందని, వారి వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. "ఇప్పుడు నాకు ఎవరూ బాస్‌లు లేరు. నన్ను ఎవరూ అదుపు చేయలేరు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం దొరికింది" అని రాజాసింగ్ అన్నారు. తానుగా మళ్లీ బీజేపీలో చేరే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. కేవలం పార్టీ జాతీయ నాయకత్వం నుంచి పిలుపు వస్తేనే తిరిగి చేరికపై ఆలోచిస్తానని చెప్పారు. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు అసెంబ్లీ సమావేశాల ముందు బీజేపీలో కలకలం రేపాయి.

# ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

**వేద న్యూస్, మెట్ పల్లి ప్రతినిధి :**



అసలే దీనస్థితి నిరుపేద కుటుంబం రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి.ఏదో చాలీచాలని వేతనము కోసం తనకు కరెంటు పని నేర్చుకొని తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాలని విద్యుత్ శాఖలో తాత్కాలిక ఉద్యోగులను గత నాలుగు సంవత్సరాలు క్రితం తీసుకోగా అందులో తాత్కాలిక ఉద్యోగిగా హరీష్ నియమితుల య్యారు.జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణానికి చెందిన సాంబరి చంద్రశేఖర్ - భులక్ష్మి దంపతులు రోజువారి కూలీలు కాగ వారి కుమారుడు సాంబరి హరిష్ తాత్కాలిక ఉద్యోగిగా పనులు చేస్తు జీవిస్తు న్నారు. హరీష్ కు కరెంట్ షాక్ తగలడంతో కుటుంబం రోడ్డున పడ్డదని,విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ మెట్ పల్లి పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ముందు బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు.బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామం విధ్యుత్ సబ్ స్టేషన్ పరిదిలో మెట్ పల్లి పటణనికీ చెందిన హరీష్ విధ్యుత్ సహయక తాత్కాలిక ఉద్యోగి(అన్మాన్ గా) ఐదు సంవత్సరాలుగా విదులు నిర్వహిస్తూ జూన్ 12 న బర్దిపుర్ గ్రామంలో విధ్యుత్ అంతరాయం పనులు చేస్తూండగా కరెంట్ షాక్ తగిలి కరెంటు పోల్ పై నుండీ పడి గాయలవ్వడంతో గ్రామస్థులు క్షతగాత్రుని మెట్ పల్లి పటణంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ రేణ అసుపత్రికి తరలించారని అన్నారు. రెండు నెలలు వైద్యం తీసుకున్నాక రెండు కాళ్లు ఆ చేతనంగా మారి మంచానికే పరిమితం అయ్యాడని అన్నారు. విద్యుత్ అధికారులు నామమాత్రంగా సందర్శించి చేతులు దులుపుకున్నారని డ్యూటీ టైం అయిపోయిన తర్వాత లైన్మెన్ ఫ్రాంక్లిన్ విధులకు తీసుకువెళ్లాడని ఆవేదన వ్యక్తం చేశారు.విధులు నిర్వహిస్తున్న సమయంలో కరెంట్ షాక్ తగిలి కింద పడిన నన్ను లైన్మెన్ ఫ్రాంక్లిన్ పట్టించుకోలేదని హరీష్ అన్నారు. ఇప్పటికీ మూడు నెలలు గడుస్తున్న ఏ ఒక్క అధికారి తనని పరామర్శించలేదని అన్నారు. ప్రస్తుతం తన పరిస్థితి దయనీయంగా ఉందని, తనకు భార్య,17 నెలల కూతురు కలదని తెలిపారు. కుటుంబాన్ని ఆదుకోవాలని హరీష్ వేడుకుంటున్నారు.

# గౌడ్ లకు వైన్స్ షాపులలో 25 శాతం కేటాయించాలి

**వేద న్యూస్, నల్లబెల్లి :**

గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో వైన్స్ షాపు టెండర్లలో 15శాతం గౌడ కులస్తులకు కెటాయించగా 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీసీలకు ఇచ్చిన హామీలలో భాగంగా కామారెడ్డి డిక్లరేషన్ లో గౌడ్ లకు 25 శాతం వైన్స్ షాపులు కెటాయిస్తామనీ ప్రకటించారనీ చీకటి ప్రకాష్ అన్నారు.మండల కేంద్రమైన నల్లబెల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ప్రకాష్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం గౌడ్ లకు 25 శాతం వైన్స్ షాపులు కెటాయించే విధంగా టెండర్లు పిలవవలసి ఉండగా, సెప్టెంబర్ లో పిలుస్తున్న వైన్స్ షాపు టెండర్లలో గౌడ్ లకు మళ్ళీ శాతం తరహాలోనే 15 శాతం మాత్రమే కెటాయిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడం గౌడ్ లను మోసం చేయడమే అవుతుంది అన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం గౌడ్ లకు 25 శాతం వైన్స్ షాపులు కెటాయించే విధంగా తక్షణమే నిబంధనలు మార్చాలనీ డిమాండ్ చేశారు. 25శాతం వైన్ షాపులు పొందే విధంగా గౌడ్ లతో కలిసి బీసీ హక్కుల సాధన సమితి ఉద్యమిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల కో కన్వీనర్ లు సామాల దేవేందర్,కస్తూరి రవిందర్ ,కొలగాని రామారావు, పప్పు రేణు కుమార్,డాక్టర్ నరేష్ గౌడ్ వైనాల వీరాస్వామి,ముత్యాల రవి గౌడ్ కడియాల క్రాంతి కుమార్,ఉప్పుల సంపత్ రాపర్తి సంపత్ గౌడ్,జెట్టి వేణుగోపాల్ గాదం మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రమంత్రి బండి సంజయ్ కి కృతజ్ఞతలు

**వేద న్యూస్, గన్నేరువరం:**



కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనానికి బ్యాలెన్స్ పనుల కొరకు నిధులు మంజూరు చేయాలని ఇటీవల మున్నూరు కాపు సంఘ నాయకులు పుల్లెల జగన్ మోహన్, పుల్లెల రాము కరీంనగర్ ఎంపీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారు. దానికి స్పందించి అతి త్వరలోనే ఎంపీ నిధుల నుండి ఐదు లక్షల రూపాయలను మంజూరు చేసి ప్రొసీడింగ్ కాపీని మున్నూరు కాపు సంఘ నాయకులకు అందివ్వడం జరిగింది. తక్కువ సమయం లోనే నిధులు మంజూరు చేసిన బండి సంజయ్ కుమార్ కు మరియు దీనికి సహకరించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పుల్లెల పవన్ కుమార్, రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్, బిజెపి నాయకులు పుల్లెల రాములకు మున్నూరు కాపు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

**వేద న్యూస్ డెస్క్:**

ప్రియుడితో కలిసి భర్తను భార్యే హత్య చేసిన ఘటన హైదరాబాద్ మహానగరంలో కలకలం రేపింది. హత్యను గుండెపోటుగా మార్చేందుకు ప్రయత్నించిన నిందితులు.. మృతదేహంపై గాయాలతో పోలీసులకు అడ్డంగా బుక్కయ్యారు. జెల్లెల శేఖర్ చిట్టి దంపతులు హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ కోదండరాం నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీళ్లిద్దరికీ 16ఏళ్ల క్రితం పెళ్లయింది. ఇద్దరు పిల్లలు. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ.. వచ్చే సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు శేఖర్. అప్పుడప్పుడు గిరాకీని బట్టి లాంగ్ డ్రైవ్ వెళ్లేవాడు. ఆ సమయంలో హరీష్ అనే వ్యక్తికి కనెక్ట్ అయింది చిట్టి. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం నడుస్తోంది. చాలా రోజులుగా గుట్టుగా సాగుతోందీ వ్యవహారం. ఓ రోజు భర్తకు అనుమానం రావడంతో భార్యపై ఫోకస్ పెట్టాడు. అప్పుడు బయటపడింది ఇల్లీగల్ రిలేషన్. సంబంధం సరికాదని.. పద్దతిగా మార్చుకోవాలని భార్య చిట్టిని మందలించాడు

# శ్రమదానం చేసి మరమ్మత్తులు చేసుకున్న గ్రామస్తులు

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం లో గత రెండు రోజుల నుండి కురిసిన భారీ వర్షాల కారణంగా స్తంభంపెల్లి, గంజి వాగు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు మట్టి రోడ్డు కొట్టుకపోవడం జరిగింది. దీనివలన నిన్నటి నుండి నేటి వరకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది. స్పందించిన స్తంభంపెల్లి, గుండన్నపల్లి గ్రామ ప్రజలు యువత, సహకారంతో స్వచ్ఛందంగా శ్రమదానం చేయడానికి ముందుకు వచ్చి జేసీబీ సహాయంతో కల్వర్టు పైపులు సెట్ చేసి దానిపై మట్టి పోయడం జరిగింది. పైపులలో పేరుకుపోయిన చెత్తను తీసి నీటి ప్రవాహం త్వరగా పోయే విధంగా శ్రమదానం చేయడం జరిగింది. గత 16 నెలలలో ఎన్ని సార్లు పాదయాత్ర, బైకు ర్యాలీ, ప్రజావాణిలో దరఖాస్తులు, పలు రకాలుగా నిరసనలు చేస్తూనే ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, స్పందించకపోవడం వారి యొక్క చిత్తశుద్ధి రెండు నియోజకవర్గాల ప్రజలకు అర్థమయితుందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, స్థంభంపల్లి గంజి వాగు వద్దకి వచ్చి పరిశీలించి వెంటనే పనులు మొదలయ్యే విధంగా చొరవ చూపెట్టాలని హై లెవెల్ వంతెన అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని రెండు నియోజకవర్గాల ప్రజలు ఎమ్మెల్యేని కోరారు. చిన్నపాటి వర్షానికే స్తంభంపెల్లి గ్రామ చుట్టుపక్కల మొత్తం రాకపోకలు నిలిచిపో వడం వలన రైతులకు, నిత్యం కూలీ పని చేసుకునే కూలీలకు, విద్యార్థులకు, ఆరోగ్య సమస్యల పరంగా అత్యవసర సేవలకు వెళ్లాలంటే దిక్కుతోచని పరిస్థి తుల్లో ఉన్నాము కాబట్టి ఈ సమస్యకు పరిష్కారం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చూపెట్టాలని కోరుతు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అక్కనపెల్లి జ్యోతి కరుణాకర్, కొప్పుల మధు, అక్కెన పల్లి కళ్యాణ్, బొంగానీ అశోక్, కస్తూరి బాపురెడ్డి, అక్కెనపల్లి పరశురాములు, అజయ్, కార్తీక్, మేడు దుల మల్లేశం, మేడుదుల రమేష్, చంద్రగిరి మహేం దర్, విజయ్, మోహన్ దాస్, గణేష్, సురేష్, గంగ య్య, శ్రీనివాస్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రంగంలోకి స్పెషల్ సెర్చింగ్ ఆపరేషన్ టీమ్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కనిపెట్టేందుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ప్రత్యేక ప్రత్యేక సెర్చింగ్ ఆపరేషన్ టీంను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎగువ మానేరు వద్ద వాగును దాటుతున్న క్రమంలో గంభీరావు పేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పంపుకాడి నాగయ్య బుధవారం గల్లంతు అయ్యారు.ఆయన ఆచూకీ కనిపెట్టేందుకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, నీటి పారుదల, మత్స్య శాఖ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎగువ మానేరు ప్రవహించే మండలాల్లోని చెక్ డ్యాంలు, బ్రిడ్జిలు, కల్వర్టులు ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని సూచించారు. నర్మాల నుంచి గంభీరావుపేట వరకు, గంభీరావుపేట నుంచి మల్లారెడ్డిపేట వరకు, మల్లారెడ్డిపేట నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు, వెంకటాపూర్ నుంచి సిరిసిల్ల వరకు, సిరిసిల్ల నుంచి మధ్య మానేరు రిజర్వాయర్ వరకు వెతకాలని ఒక్కో ప్రాంతానికి ఐదుగురితో కలిపి ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ సభ్యులు వెంటనే తమ విధి నిర్వహణను మొదలు పెట్టాలని ఆదేశించారు.

# వేద న్యూస్ కథనానికి స్పందన

**- ఎట్టకేలకు దిగివచ్చిన అధికారులు - మంచి నీటి పైపుల పునరుద్ధరణ**





వేద న్యూస్

వృధాగా పోతున్న మంచినీరు

వేద న్యూస్, మడికొండ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 64 వ డివిజన్ మడికొండ మెట్టుగుట్ట ఆర్చ్ ఎదురుగా ఉన్న నెహ్రూ నగర్ కాలనీ మెయిన్ రోడ్డు వద్ద మున్సిపాలిటీ నీరు వృధాగా పోయి మురుగు కాలువలో కలుస్తుంది. గత కొన్ని రోజులుగా మంచినీటి పైపులు పగిలి నీరు వృధాగా పోతున్నా కనీసం పట్టించుకున్న నాధుడే లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నిసార్లు మున్సిపాలిటీ అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు చెప్పిన కూడా పట్టించుకోవట్లేదు అని అంటున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నీరు వృధాగా పోకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

2025-08-22
https://epaper.vedhanews.in/

**వేద న్యూస్, మడికొండ :**

మంచి నీరు వృధాగా పోయి మురుగు కాలువలో కలిసి పోతుండటంతో..ఈ నెల 22 వ తేదీన "వేద న్యూస్" దినపత్రికలో దీనిపై కథనం ప్రచురించగా,స్పందన వచ్చింది. ఎట్టకేలకు సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది స్పందించి దిగివచ్చి మంచి నీటి పైపుల పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. మిగతా చోట్ల ఉన్న మంచినీటి పైపుల లీకేజీ పనులను కూడా ప్రారంభించామని మున్సిపల్ అధికారులు తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేద న్యూస్ దినపత్రిక కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# 3 వాహనాలకు ఒకే నంబర్!

**- రవాణాశాఖ ఆఫీసర్ల వింత..!**
**- సదరు నంబర్‌పై రూ.4 వేల పై చిలుకు చలాన్**
**- ఇంతకీ ఈ ఫైన్ ఎవరు చెల్లించాలి..? మరి..**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**







నంబర్ ఒక్కటే..కానీ, వాహనాలు మూడు.. వినేందుకు విడ్డూరంగా ఉన్నా ఇది నిజం. వరంగల్ నగరంలో యూనికాన్, గ్లామర్ రెడ్, బ్లూ కలర్ ద్విచక్ర వాహనాలకు ఒకే నంబర్ (%ూ 03 జుఖీ% 8615) గల నంబర్ ప్లేట్ వాడుతూ.. నగరంలో వాహనదారులు చక్కర్లు కొడుతున్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక కెమెరాకు చిక్కాయి. దాంతో అసలు ఒకే నంబర్‌ను రవాణా శాఖ అధికారులు మూడు బండ్లకు కేటాయించారా? లేదా? వాహనదారులు మ్యానిపులేట్ చేస్తున్నారా? అనే అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఒకే నంబర్‌ను రవాణా శాఖ అధికారులు 3 వాహనాలకు కేటాయిస్తే.. అది వింతేనని పలువురు అంటున్నారు. సదరు నంబర్‌పై రూ.4,385 చలాన్ పెండింగ్‌లో ఉండటం గమనార్హం. ఇప్పుడు ఈ ఫైన్‌ను సదరు ముగ్గురు వాహనదారుల్లో ఎవరు చెల్లిస్తారు? అనే ప్రశ్నకు ఎవరు సమాధానం ఇస్తారో చూడాలి. ఈ విషయమై ట్రాఫిక్ ఉన్నత అధికారులు విచారణ చేపట్టి.. తగు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# స్కూల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించండి

**వేద న్యూస్ డెస్క్:**



సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్ యాజమాన్యాలతో సమన్వయ సమావేశం జరిగింది. మాదాపూర్ జోన్ పరిధిలోని పలు ప్రముఖ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి జాయింట్ సీపీ ట్రాఫిక్ డా. గజారావు భూపాల్, ఐపీఎస్, ఇతర ట్రాఫిక్ అధికారులు హాజరయ్యారు. స్కూల్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు సంబంధించిన ట్రాఫిక్ నిర్వహణ, రద్దీ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా స్కూల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ట్రాఫిక్ అధికారులు హైలైట్ చేశారు. విద్యార్థులు ఎక్కువ మంది స్కూల్ బస్సులను ఉపయోగించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గిస్తే, స్కూల్ పరిసర ప్రాంతాల్లో వాహన రద్దీ తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో స్కూల్ పక్కన, యూ-టర్న్ వద్ద ప్రధానంగా సమస్యలు ఎదురవుతున్నాయని, అందువల్ల స్కూల్ వాహనాల కదలికకు సమర్థవంతమైన ప్రణాళిక అవసరమని సూచించారు. ఒకే మార్గంలో ఒకేసారి ఎక్కువ స్కూల్ వాహనాలు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు స్కూల్ సమయాలను వ్యత్యాసం పాటించేలా చూడాలని కూడా యాజమాన్యాలను కోరారు. ఇక తల్లిదండ్రులకు కార్ పోలింగ్ పద్ధతి గురించి అవగాహన కల్పించడం ద్వారా రోడ్లపై వాహనాల సంఖ్య తగ్గించే అవకాశం ఉందని ఈ సమావేశంలో చర్చించారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం బస్సు డ్రైవర్లకు నిరంతరంగా ఆల్కహాల్ పరీక్షలు నిర్వహించాలని, అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు స్పష్టమైన మార్గదర్శకాలు, ప్రయాణ మార్గాలను స్కూల్ యాజమాన్యాలు అందించాలని సూచించారు. ఈ విధంగా స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు, ట్రాఫిక్ పోలీసులు కలిసి సమన్వయంతో పనిచేస్తేనే సురక్షితమైన, సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ సాధ్యమని అధికారులు పేర్కొన్నారు.

# అధిక లాభాలంటూ ఆశచూపించి దోపిడీలు



పెద్దఎత్తున లాభాలు వచ్చాయని చెప్పడంతో విశ్రాంత ఉద్యోగికి నమ్మకం కుదిరింది. సైబర్ నేరగాళ్లు చెప్పినట్లు ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని కొంత పెట్టుబడి పెట్టగా తొలుత కొంత లాభం ఇచ్చారు. దీంతో పూర్తిగా నమ్మిన బాధితుడు విడతల వారీగా దాదాపు 2 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టాడు. ఆ డబ్బు వెనక్కి తీసుకోవాలంటే ఛార్జీల పేరిట మరో 75 లక్షలు కాజేశారు. ఇంకా కావాలని ఒత్తిడి చేస్తుండటంతో డబ్బులు కావాలని కుమారుడిని అడగాడు. అతను పూర్తిగా ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. తాను మోసపోయానని వృద్ధుడు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కుంగుబాటుకు లోనవ్వడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కుమారుడిని పిలిపించి విషయం చెప్పడంతో అతను తనతో పాటు తండ్రిని దుబాయ్ తీసుకెళ్లాడు.

**– సీబీఐ అధికారినంటూ పరిచయం చేసుకుని..**

తిరుపతికి చెందిన 72 ఏళ్ల రామలక్ష్మికి సైతం ఇదే విధంగా వాట్సప్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తనకు తాను సీబీఐ అధికారినంటూ పరిచయం చేసుకున్నాడు. మీ బ్యాంకు ఖాతా ద్వారా మనీలాండరింగ్ జరిగిందని చెప్పాడు. ఆమె ఆధార్, ఫోన్ నెంబర్ చెప్పి మీరు డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ బెదిరించారు. మనీలాండరింగ్ చేసిన డబ్బులు వెంటనే కట్టాలంటూ ఒత్తిడి చేశారు. భయపడిన ఆమె దాదాపు రెండున్నర కోట్లు నేరగాళ్ల ఖాతాకు బదిలీ చేసింది. ఆ తర్వాత మోసపోయానని గ్రహించినా భయంతో కుమారుడికి ఈ విషయం చెప్పలేకపోయింది. తన జీవితాంతం కష్టపడిన సొమ్ము పోగొట్టుకున్న ఆమె తీవ్ర మనోవేదనకు గురయ్యింది. ఇప్పుడు డబ్బులు ఎక్కడా అంటే కుటుంబ సభ్యులకు ఏం చెప్పాలో ఆమెకు పాలుపోవడం లేదు. హైదరాబాద్?కి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో వచ్చిన వాట్సాప్ సందేశానికి స్పందించాడు. మొదట 5 లక్షలు పెట్టుబడి పెట్టాడు. మోసపూరిత యాప్ వాలెట్‌లో 10 లక్షల లాభం చూపించడంతో అత్యాశకు పోయి 5.98 కోట్లు పెట్టుబడి పెట్టి వాటిని కోల్పోయాడు. ఈ విషయం పిల్లలకు చెప్పలేక సతమతమవుతున్నాడు. కుటుంబం మొత్తం తనను నమ్మి డబ్బులు ఇస్తే తాను ఇలా మోసపోయానని ఆయన తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. వాళ్ల ముందు ఎలా తలెత్తుకోవాలని బాధపడ్డారు.

## అణుపరీక్షలు వద్దు శాంతి చర్చలే ముద్దు

ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఆగస్టు 29, 2009 అంతర్జాతీయ అణుపరీక్షకు వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించింది. ఇది అణుపరీక్షల గురించి అవగాహన కల్పించడానికి, అణుఆయుధాలు లేని ప్రపంచాన్ని సాధించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడమే లక్ష్యం గా జరుపుకుంటారు. అణుపరీక్షలోని పేలుళ్ళు, ఇతర అణుపేలుళ్ళ ప్రభావాల గురించి, అణ్వాయుధ రహిత ప్రపంచం లక్ష్యాన్ని సాధించే సాధనాల్లో ఒకటైన ఈ అణుపరీక్షలను నిలిపివేయవలసిన అవసరాన్ని గురించి 'అవగాహన పెంచాలని ప్రపంచం దేశాలకు పిలుపునిచ్చింది. మనిషి అభివృద్ధి చెందుతూ అంతరాళం చుట్టి వస్తున్న ఇర్ష్యా, ద్వేషం, స్వార్థంతో తనకుతానే శత్రువుగా మారిపోయి అణుబాంబుతో రాక్షసుడయ్యాడు. ఇంటికి పొరుగింటికి పడదు, దేశం పొరుగు దేశానికి గిట్టదు, నిత్యం కయ్యంతో కాలు దువ్వుతూ రోజుకొక యుద్ధంతో ప్రపంచ ప్రజలు భయం నీడలో బతుకుతున్నారు. శత్రువు తలవంచకపోతే శత్రువునే కరిగించాలి అన్న అమెరికా పట్టుదలతో 1945 ఆగస్టు 6, 9న అమెరికా ప్రయోగించిన బాంబులు హిరోషిమా, నాగసాకి నగరాలను ఒక క్షణంలో శ్మశానంగా మార్చేసింది.ఆ రోజు సూర్యుడు ఉదయించకముందే, మానవ జాతి మీద అణు అంధకారం కమ్ముకుంది. కానీ కాలిపోయింది శత్రువు కాదు, మానవత్వమే. బతికిపోయిన వారూ జీవచ్ఛవాల్లా మిగిలారు. క్షణాల్లో లక్షలాది ప్రాణాలు బూడిద, వేలాది ఇళ్లు శిథిలాలు, తరతరాల పిల్లల రక్తంలోకి చొరబడిన కిరణజన్య వ్యాధులు, వికలాంగతలు, మానసిక వేదన తరతరాల పాటు వారిని వెంటాడాయి. ఒక నగరాన్ని నిర్మించడానికి శతాబ్దాలు పడతాయి కానీ ఒక బాంబుపడితే క్షణాల్లో శ్మశానం అవుతుంది. హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా వేసిన రెండు అణుబాంబులు కేవలం జపాన్ నేలనే కాదు మనిషి హృదయాన్నే చీల్చేశాయి. మానవత్వం రాక్షసత్వమైన ఆ క్షణాన సూర్యుడు తలదించుకున్నాడు, గాలి విషమైంది, నీరు విషాదమైంది. ప్రకృతి శవాల విషదాలాపనతో మూగబోయింది. అప్పటి నుంచి మానవజాతి అణుఆయుధాల దారుణాన్ని, భయంకరతను అనుభవిస్తూ వస్తోంది. ఈ విధ్వంసం మనిషి సృష్టించిన మరో శస్త్రానికి లేదు. ఈ దారుణం తర్వాత అణు యుద్ధం అంటే దేశాల మధ్య యుద్ధం కాదు, మానవజాతి మీదే యుద్ధం అని ప్రపంచం నేర్చుకుంది. అయినప్పటికీ చాలా దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొని ఉన్నాయి. అయిన దేశాలు అణు పరీక్షలతో పొరుగు దేశాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

నేటికీ ప్రపంచంలో 13,000కు పైగా అణుబాంబులు సిద్ధంగా ఉన్నట్లు అనాధికార లెక్కలు భయపెడుతున్న నిజం. అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి దేశాలు ముందువరుసలో ఉండగా చిన్న దేశాలు కూడా భద్రత పేరిట అణుశక్తి వైపు పరుగులు పెడుతున్నాయి. నక్కల మధ్య మేకలా బతకలేమంటూ మరిన్ని దేశాలు అణుబాంబుల తయారీకి తెరతీస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో పుతిన్ అణు బటన్ నొక్కే పరిస్థితి వస్తే వెనకాడం అన్న మాటతో ప్రపంచం ఒక్కసారి ఉలిక్కిపడింది. ఉత్తర కొరియా తన బాంబులతో పొరుగు దేశాలపై భయాలు సృష్టిస్తోంది. చైనా వేగంగా తన అణు ఆయుధాల నిల్వ పెంచుకుంటోంది.దక్షిణ చైనా సముద్రం, తైవాన్ సమస్యల వల్ల అంతర్జాతీయ ఉద్రిక్తత పెరుగుతోంది. ఉత్తర కొరియా వరుస అణు పరీక్షలతో పొరుగు దేశాలను బెదిరిస్తోంది. భారత్ –పాకిస్తాన్ రెండూ అణు దేశాలు కాబట్టి నిత్యం జరిగే సరిహద్దు ఘర్షణలలో ఒక్క తప్పు నిర్ణయం జరిగితే మానవజాతే బూడిద అవుతుంది. పాకిస్తాన్ అణుబాంబు ఉన్నదనే గుడ్డి నమ్మకంతో ఏదో ఒక రకంగా మన దేశంపైకి కాలు దువ్వుతున్నది.మనం శాంతిని కోరుకుంటున్నందున పాకిస్తాన్ ఊపిరి పీల్చుకుంటుంది. కానీ ఆయుధ సంపత్తికి కొదవలేని దేశం మనది అయినా మనకు మానవజాతి సుఖశాంతులే ముఖ్యం. ఇరాన్ కూడా అణు ఆయుధాలు తయారు చేస్తుందనే అనుమానాలు ఆంక్షల నేపథ్యంలో ఇజ్రాయెల్– పాలస్తీనా మధ్య యుద్ధాలు, మధ్యప్రాచ్యంలో ఎప్పుడైనా అణుఘర్షణ మంటలు రగులుతాయన్న భయం ఉంది. ఇవన్నీ ఒకే మాట చెబుతున్నాయి: బాంబులు పడితే ఎవరూ గెలవరు, మానవజాతి మొత్తం ఓడిపోతుంది. అణు బాంబు దేశాన్ని రక్షించదు, మానవజాతిని అంతమొందిస్తుంది. ఏ దేశాన్ని గెలిపించక మానవజాతిని శ్మశానంలో పడేస్తుంది. యుద్ధం మొదలైతే విజేతలేవరు కారు అందరూ పరాజితులే మిగులుతారు. మానవ జాతి మనుగడకు, పర్యావరణ, భవిష్యత్ తరాలకు శాపంగా నిలుస్తుంది. అన్ని దేశాలు అణు పరీక్షలు ఆపివేసి దేశాధినేతల మధ్య శాంతి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073